తేది: 21.02.2017

ద్రావిడ విశ్వవిద్యాలయంలో నేడు జరిగిన "ప్రస్తుత సమాజంలో అల్పసంఖ్యాక వర్గ భాషల పరిస్థితి" అన్న అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పద్మ శ్రీ అవార్డు గ్రహీత ఆచార్య డి.పి.పట్నాయక్, విశిష్ట అతిథిగా ద్రావిడ విశ్వవిద్యాలయం మొదటి కులసచివులు ఆచార్య బి.రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సదస్సు అంతరించిపోతున్న ద్రావిడ భాషల పరిరక్షణ కేంద్రం, లింగ్విస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ ఎమెనో భవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ గారు మాట్లాడుతూ.... ఈ మూడు రోజుల సదస్సుకు యువ భాషా శాస్త్రవేత్తలైన 78 సంవత్సరాలు కలిగిన ఆచార్య బి.రామకృష్ణారెడ్డి గారు, 86 సంవత్సరాలు పైబడిన ఆచార్య డి.పి.పట్నాయక్ గారు విచ్చేయడం ద్రావిడ విశ్వవిద్యాలయంకు గర్వకారణమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని పరిశోధకులు తమ పరిశోధనల్లో ప్రగతిని సాధించి, వారి ప్రతిభను నలుదిశలా వ్యాపింపజేయాలని ఆకాంక్షించారు.

ఆచార్య డి.పి.పట్నయక్ మాట్లాడుతూ.... గిరిజన జాతి ప్రజలు దేశంలో 8 శాతం జనాభాను కలిగివుండి భాషాపరమైన, సాంస్కృతికపరమైన గుర్తింపు పొందడానికి అర్హత ఉన్నా పొందలేకపోతున్నారన్నారు. వీరిలో అతి ప్రాచీనులు నీగ్రోయిడ్స్‌లని తెలియజేశారు. హిందూ హిందీ ఈ రెండూ మనకు మతపరమైన, భాషాపరమైన అల్పసంఖ్యాక భాషల గురించి మనం పరిశీలించాలంటే ఈ రెండు అంశాలను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. హిందూ మతమన్నది అతి పెద్ద మతమని, అయితే దీనిలో చాలా అల్పసంఖ్యాక భాషా సమూహాలున్నాయన్నారు. 3 కోట్ల దేవుళ్ళు, దేవతలు హిందూ మతంలో ఉన్నారని, వీరిలో విష్ణువుకే వెయ్యి నామాలు ఉన్నట్లు మన చరిత్ర చెబుతోందన్నారు. హిందీ భాషను మన దేశంలో42 శాతం మంది మాట్లాడుతున్నారన్నారు. హిందీలో కూడా చాలా అల్పసంఖ్యాక భాషా సమూహాలు ఉన్నాయని తెలియజేశారు. అయితే ఈ హిందీ భాషలో 45 రకాల మాండలికాలను ఉపయోగిస్తున్నారన్నారు.

ఆచార్య రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ... ఒక భాష మెజార్టి భాషనా..? మైనార్టి భాషనా..? అన్నది సంఖ్యాపరంగా, జనాభాపరంగా, సామాజిక ఆర్థికపరమైన, విద్యా బోధన ఏ భాషలో జరుగుతోంది, మనుషుల యొక్క దృక్పథాలు, ప్రభుత్వం భాషను గుర్తించే విధానాలు అన్న అంశాలపై ఆధారపడి వుంటుందన్నారు. గిరిజన భాషలకు ఒక ప్రత్యేక సంస్కృతీ, జాతిపరమైన గుర్తింపు ఉన్నప్పటికీ గిరిజన భాషలన్నీ అల్పసంఖ్యాక వర్గాల భాషలే అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అల్పసంఖ్యాక భాషలు ఏమనగా సవర, గదబ అని తెలిపారు. సవర భాష మాట్లాడే వారు శ్రీకాకుళం, గదబ భాషను విజయనగరం జిల్లా సాలూరు ప్రాంతంలో నివశిస్తున్నారన్నారు. వీరు సవర, గదబ భాషలతో పాటు తెలుగు, ఒరియా భాషలను సైతం మాట్లాడగలరన్నారు.

ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య జి.బాలసుబ్రమణియన్, రిజిస్ట్రార్ ఆచార్య బి.తిరుపతిరావు, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఎస్.పెంచలయ్య, డా.అంబేద్కర్, శ్రీకుమార్, డా.కేశవమూర్తి, డా.ప్రసాద్ నాయక్, డీన్ ఆచార్య వరదరాజులనాయుడు, ఆచార్య శ్రీనివాసకుమార్, ఇన్‌చార్జి లైబ్రరియన్ డా.దొరస్వామి, ఎన్.ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ డా.వేణుగోపాలరెడ్డి, డా.దుర్గాప్రవీణ్, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.









